క్లుప్తంగా

పన్ను చెల్లించాలని ఆందోళన



కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న సర్పంచ్, పంచాయతీ సిబ్బంది

ఖమ్మంరూరల్: మండలంలోని బారుగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని మహ్మదీయ కాలేజీ యాజమాన్యం చెల్లించాల్సిన ఇంటి పన్నుల చెల్లింపు నిర్లక్ష్యంపై గురువారం గ్రామ సర్పంచ్ పల్లెర్ల పాండు ఆధ్వర్యంలో కళాశాల ఎదుటనిరసన తెలిపారు. మార్చి 2023 నాటికి రూ.50.61లక్షల బకాయి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రేఖ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం టూటౌన్ కమిటీ, బీవీకే ఆధ్వర్యంలో రేపు నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరంలో బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, బీవీకే మేనేజర్ వై.శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా మొదటి శనివారం స్థానిక మంచికంటి భవన్‌లో హైదరాబాద్ కాంటినెంటల్ ఆస్పత్రి సౌజన్యంతో ప్రముఖ కేన్సర్ సర్జన్ డాక్టర్ రవిచందర్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో తొలిసారి నిర్వహించే కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులను వినియోగించుకోవాలని కోరారు.

నారాయణకుంటకు 'భక్త రామదాసు' నీరు

కూసుమంచి: మండలంలోని తురకగూడెం గ్రామ శివారు నారాయణకుంటకు గురువారం భక్తరామదాసు ప్రాజెక్టు నీళ్లు చేరాయి. ఈ కుంటకు గతంలో ప్రాజెక్టు నీరు చేరకపోవటంతో పాటు రైతుల పంటలు ఎండిపోతుండగా వారు ఇటీవల ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో జల వనరుల శాఖ అధికారులు పైపు లైన్ నిర్మాణం చేపట్టి నీటిని విడుదల చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సార్ సినిమాను ఉచితంగా చూపించాలి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సార్ సినిమాను థియేటర్లలో ఉచితంగా చూపించాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షురాలు దీపిక, సహాయ కార్యదర్శి సతీష్‌లు కోరారు. ఈ మేరకు గురువారం నగరంలోని ఎన్నెస్పీకాలనీ ప్రభుత్వ పాఠశాలలో పీడీఎస్‌యూ నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రైవేటైజేషన్ పేరుతో విద్యా వ్యవస్థ ఏ విధంగా వ్యాపారంగా మారిందో, ప్రభుత్వ విద్యాసంస్థలు ఏ విధంగా బలహీన పడ్డాయో కళ్ళకు కట్టినట్లుగా చూపించినందున ఈ సినిమాను విద్యార్థులకు చూపించాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కరుణ్, నాయకులు గణేష్, రవి, తరుణ్, సతీష్,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ నిరసన

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థి మృతి చెందటం పట్ల ఎన్‌ఎస్‌యూఐ నాయకులు గురువారం నగరంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి.మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు నవీన్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ సాత్విక్ అనే విద్యార్థిని అధ్యాపకులు కొట్టటం వల్లే మృతి చెందారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ అసీఫ్, ఆలి, చందు తదితరులు పాల్గొన్నారు.

డొంక రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్లలో రైతులకు ఉపయోగపడేలా నిర్మిస్తున్న డొంక రోడ్డు పనులను సర్పంచ్ ధారా శ్యాం గురువారం ప్రారంభించారు. రూ.7లక్షలతో ఈ రోడ్డు నిర్మిస్తుండగా, రైతులు పరికరాలు, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతికి ఉపయోగపడుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుర్రా భాస్కరావుతో పాటు ఐలా నర్సింహారావు, కోటగిరి వీరయ్య, ఐలా రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు డైరెక్టర్ల బృందానికి ఎంపీ ఆతిథ్యం

ఖమ్మంమయూరిసెంటర్: ఆంధ్రా బ్యాంక్ కర్షక సేవా సమితి చైర్మన్ బీరెడ్డి నాగచంద్రరెడ్డి, డైరెక్టర్లు, సిబ్బందితో కూడిన బృందం ఢిల్లీలో జరుగుతున్న జాతీయ కిసాన్ మేళాలో పాల్గొనడానికి శుక్రవారం ఢిల్లీకి చేరుకున్నారు. చైర్మన్‌తో పాటు 11 మంది బ్యాంక్ డైరెక్టర్లు, ఇద్దరు సిబ్బందిని స్వాగతించిన ఎంపీ నామా నాగేశ్వరరావు తన నివాసంలో వసతి సౌకర్యం కల్పించడంతో పాటు ఢిల్లీలో మూడు రోజుల పాటు ఈ బృందం పర్యటించేందుకు ఆయన అన్ని ఏర్పాట్లు చేశారు.

కంపు కొడుతున్న కాలనీ

డ్రెయిన్లు లేక అస్తవ్యస్తం..

- మురుగు నీరు నిలవడంతో దోమలు స్వైరవిహారం
- రోగాల బారిన పడుతున్న నివాసులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- వీవీపాలెంలో 'డబుల్' ఇళ్ల లబ్ధిదారుల అవస్థలు





వీవీపాలెంలోని డబుల్ బెడ్‌రూం సముదాయం (ఇన్‌సెట్) నివాసాల మధ్య నిలిచిన మురుగు నీరు

రఘునాథపాలెం: ప్రతీ పేద వానికి పక్కా ఇళ్లు అందించాలని లక్ష్యంలో తెలంగాణ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు చేపడుతోంది. ఈ క్రమంలో రఘునాథపాలెం మండలంలోని వీవీపాలెంలో 20 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మాణం చేపట్టి పేదలకు పంపిణీ చేశారు. కానీ, అత్యసరమైన డ్రెయినేజీ నిర్మాణ వ్యవస్థను మాత్రం అధికారులు మరిచారు. దీంతో కాలనీలో వాడుకున్న మురుగు నీరంతా ఎటు పోయే పరిస్థితి లేక ఎక్కడికక్కడే నిలిచిపోయి మురుగుకూపాలను తలపిస్తున్నాయి. వేసవిలోనే గృహాల్లో వాడుకునే మురుగు నీరు పోయే మార్గం లేక ఇళ్లను ఆనుకొని గుంతలు ఏర్పాటు చేసుకున్నారు. ఫలితంగా మురుగు కంపు కొడుతూ, దోమలు వృద్ధి చెంది స్వైర విహారం చేస్తూ కాలనీవాసులను రోగాల బారిన పడేస్తున్నాయి. భయటకు రావాలంటేనే నివాసులు భరించలేని కంపుతో నానా అవస్థలు పడుతున్నామని నివాసులు చెపుతున్నారు.

డ్రెయిన్లు లేక నరకయాతన..

నివాసం ఉండటానికి బాగానే ఉంది. తాగటానికి మిషన్ భగీరథ నీరు వస్తోంది. నివాసాల చుట్టూ రోడ్లు నిర్మాణం లేకపోవడంతో పాటు డ్రెయిన్లు లేక నరకయాతన పడుతున్నట్లు నివాసులు చెపుతున్నారు. వేసవిలోనే ఇలా ఉందంటే వర్షాకాలంలో తమ జీవనం ఎలా కొనసాగించామో అర్థం చేసుకోవాలని అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు. మండలంలో అనేక గ్రామాల్లో మాత్రం డబుల్ బెడ్‌రూం సముదాయం నిర్మాణ సమయంలోనే వాటి చుట్టూ మౌలిక వసతుల కల్పన రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం చేపట్టారు. కానీ, వీవీపాలెంలో మాత్రం ఎందుకు నిర్మాణం చేయలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మురుగు నిల్వలతో డెంగీ బారిన పడి వేలాది రూపాయాలు ఖర్చు పెట్టాల్సి వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ బాధలను ఆలకించి రోడ్లతో పాటు డ్రెయిన్ల నిర్మాణం చేసి మురుగు బాధల నుంచి విముక్తి కల్గించాలని కోరుతున్నారు.

డెంగీ బారిన పడి కోలుకున్నా..



తమ నివాస సముదాయంలో డ్రెయిన్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల డెంగీ బారిన పడి వేలాది రూపాయలు ఖర్చు పెట్టి కోలుకున్నా. ఇల్లు బాగానే ఉన్నా.. పరిసర ప్రాంతాలు సరిగా లేవు. అధికారులు తమ బాధలను ఆలకించాలి.

– జి.రాము, డబుల్ బెడ్‌రూం నివాసి

మౌలిక వసతులు కల్పించాలి..



ఇతర ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూం సముదాయాల్లో నిర్మాణం చేసిన విధంగా తమ కాలనీలో కూడా డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణం చేసి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి. మురుగు నీరు నిల్వలు లేకుండా తక్షణం చర్యలు చేపట్టాలి.

– కె.పృథ్వి, డబుల్ బెడ్‌రూం నివాసి

దేవాలయ, ఇనాం భూముల పరిశీలన



కైకొండాయిగూడెం భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్, దేవాదాయశాఖ అధికారులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ కొత్తగూడెంలోని ఇనాం భూములను ఆర్డీఓ రవీంద్రనాథ్, తహసీల్దార్ ఎం.శైలజలు గురువారం పరిశీలించారు. ఇనాం భూములకు బదులుగా అసైన్డ్ భూములుగా రికార్డుల్లో తప్పులు దొర్లినట్లు కొంత మంది రైతులు చేసిన వినతుల మేరకు వారు ఈ భూములను పరిశీలించారు. అంతేకాక నగరంలోని 1వ డివిజన్ మల్లేమడుగు రెవెన్యూలో దేవాలయ భూములను తహసీల్దార్ శైలజ, దేవాదాయశాఖ అధికారులు పరిశీలించారు. కై కొండాయిగూడెం శివాలయం భూమి రికార్డుల ప్రకారం 20 ఎకరాలు ఉండాల్సి ఉండగా.. ఫీల్డ్‌లో మాత్రం కేవలం 11 ఎకరాలు మాత్రమే ఉందని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన కొంతమంది చేసిన ఫిర్యాదుపై తహసీల్దార్, దేవాదాయ అధికారులు సంయుక్తంగా భూములను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న రైతులతో వారు మాట్లాడారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించిన తర్వాత సర్వేకు సహకరించినట్లయితే సమస్యకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ రైతులకు, గ్రామస్తులను కోరారు. రెండు, మూడు రోజుల్లో రికార్డులు పరిశీలించి రికార్డుల్లో ఉన్న ఆధారాలను వెల్లడిస్తామని వివరించారు.

అంగన్‌వాడీ హక్కుల సాధనకు పోరాటం



ధర్నాచేస్తున్న అంగన్‌వాడీలు

ఖమ్మం మామిళ్లగూడెం: అంగన్‌వాడీ హక్కుల సాధన కోసం పోరాటం సాగుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీకాంత్ అన్నారు. అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఏళ్లతరబడి ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల పనిభారం పెరిగి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిదేళ్ల కాలంలో అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. 45 ఏళ్లకు పైగా పనిచేస్తున్న అంగన్‌వాడీలకు ఎలాంటి చట్టబద్ధత సౌకర్యాలు కల్పించకుండా మోసం చేస్తుందని పేర్కొన్నారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విష్ణువర్ధన్, కల్యాణపు వెంకటేశ్వరావు, నాయకులు మోహన్‌రావు, నరసింహారావు, తిరుమలచారి, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కోటేశ్వరీ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమ్య, సుధారాధ, పాపారాణి, పద్మ, స్వరాజ్యం, రమా, జె.పద్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలను వినియోగించుకోండి

ఖమ్మంఅర్బన్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడానికి అంగన్‌వాడీలు అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ కవిత పేర్కొన్నారు. గురువారం నగరంలోని 4వ డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలకు దాత అందించిన తూకం మిషన్లు ఆయా కేంద్రాలకు కార్పొరేటర్లు దండాజ్యోతిరెడ్డి, నాగండ్ల కోటితో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు, స్థానికులు సతీష్, మల్లేశ్వం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతకు అనుమతి తప్పనిసరి

నేలకొండపల్లి: చెట్ల నరికివేతకు ఫారెస్ట్ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, లేకుంటే చర్యలు తీవ్రంగా ఉంటాయని అటవీ శాఖ రేంజర్ పి.శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని నాచేపల్లిలో ఓ రైతు 20 టేకు చెట్లను నరికేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు చెట్లను పరిశీలించేందుకు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇంట్లో చెట్లు నరికినా, దుంగలను వస్తువులుగా తయారు చేసుకోవాలన్నా అనుమతులు తీసుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు. చెట్లును పెంచిన రైతులకు అనుమతులు గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అదే విధంగా సామిల్ యజమానులు అటవీ శాఖ అనుమతులు లేకుండా వచ్చిన కర్రను కోస్తే వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో నర్సరీలో మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ దానియేల్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడదాం



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం: రైతాంగ, కూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న ఢిల్లీలో కార్మిక, కర్షక రైతుల మహా ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని గజ్జల వెంకటయ్య స్మారక భవనంలో రైతు సంఘం, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి భారీగా నిధులు కేటాయించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ రైతాంగ, కార్మిక విధానాలను ఎండగట్టిందుకు మహాధర్నాలో లక్షలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు ఎర్ర శ్రీనివాసరావు, సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు తుల్లూరి నాగేశ్వరరావు, బింగి రమేష్, నాయకులు వీరన్న, ధర్మాచారి, కోట ఉపేందర్‌రెడ్డి, యశోద, ఉపేందర్, రావుల వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

పాలాభిషేకం

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్ల గ్రామంలో మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు భూక్యా హరీష్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. రైతుల ఖాతాల్లోకి కిసాన్ యోజన నగదు జమ కావడంతో పాటు మూడు రాష్ట్రాల్లో విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. మండలం అధ్యక్షుడు నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి బాలాజీ, సాయి, హరీష్, నరేష్, వినోద్, జంపా, సాగర్, గోపి పాల్గొన్నారు.

బియ్యం వితరణ

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువులో ఇటీవల మృతిచెందిన ఆరెంపుల భద్రయ్య కుటుంబానికి భుజంగరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు మాధవిరెడ్డి ద్వారా అందించిన 50 కేజీల బియ్యాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. అంతేకాక గ్రామ సర్పంచ్ బైరి మౌనిక కాంగ్రెస్ నాయకులు మహేష్, వెంకటనర్సయ్య, కోటయ్యలు కూడా మరో 50 కేజీల బియ్యాన్ని వితరణగా అందించారు. నాయకులు గుగులోత్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



జలాభిషేకం చేస్తున్న భక్తులు

కామేపల్లి(కారేపల్లి): మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామంలో శ్రీలక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యస్వామి, అంకమ్మతల్లి విగ్రహాల ప్రతిష్ఠ వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కాగా, గురువారం జలాభిషేకం, బలిహరణ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ గ్రామస్తులు హోమ పూజలను చేశారు. అర్చకులు జలగం భార్గవ అవధాని, వేదుల రామకృష్ణ శర్మ, తుంగతుర్తి వీరభద్రప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

రూ.5వేల పింఛన్ ఇవ్వాలి

తిరుమలాయపాలెం: బోధకాలు బాధితులకు ప్రభుత్వం నెలకు రూ.5వేలు ఇవ్వాలని, ఉచితంగా మందులు, నిత్యావసర వస్తువులు అందించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ చంద్రన్న వర్గం జిల్లా నాయకుడు తిమ్మిడి హన్మంతరావు అన్నారు. గురువారం ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ఉచితంగా అందించిన వస్తువులను అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫైలేరియా వ్యాధిగ్రస్తుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు.నాయకులు శ్రీనివాసరావు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కామేపల్లి(కారేపల్లి): మండల పరిధిలోని పండితాపురం గ్రామంలో గల కేఎంబీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కొమ్ము నాగేశ్వరరావు దంపతులు గురువారం ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ప్రజల ప్రాణాలంటే లెక్కలేదా?



వైద్యాధికారిని ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

నేలకొండపల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటంలో వైద్యులు నిర్లక్ష్యం చేస్తున్నారని.. ప్రజల ప్రాణాలంటే లెక్క లేదా అని ప్రజాప్రతినిధులు అధికారులపై మండిపడ్డారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో 24 గంటల వైద్యసేవలు అందించటం లేదని, ఆస్పత్రికి సాయంత్రం వస్తే ఒక్కరూ అందుబాటులో లేరని ఇటీవల ఇరువురు ప్రాణాలు కోల్పోయారని, ఎంపీటీసీ బొడ్డు బొందయ్య ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే వైద్యుల పోస్టుల భర్తీ చేస్తామని చెప్పటంతో సభ్యులు శాంతించారు. ఆటో స్టార్టర్లు తీసి వేయటం వలన పంటలు ఎండుతున్నాయని ఎంపీటీసీ నాగయ్య పేర్కొన్నారు. ఎక్సైజ్ ఎస్సై శంకర్ నివేదిక చదువుతుండగా.. గ్రామాల్లో బెల్ట్ షాపుల వలన అనేక గొడవలు అవుతున్నాయని వెంటనే వాటిని బంద్ చేయాలని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరారు. నేలకొండపల్లి పంచాయతీలో ఉపాధి పనుల్లో ఎందుకు వివక్ష చూపుతున్నారని పీఆర్ అధికారులను నిలదీశారు. ప్రభుత్వం అందించే ఉచిత చేప పిల్లల ద్వారా సొసైటీ సభ్యులు లబ్ధి పొందకుండా, లీజ్ పేరుతో ఇతర కాంట్రాక్టర్లకు ఇస్తున్నారని, అటువంటి చెరువులపై వెంటనే రిపోర్టు ఇవ్వాలని తహసీల్దార్ దారా ప్రసాద్ మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశానికి హాజరైన పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో మన ఊరు–మన బడి సీఎం కేసీఆర్ ప్రకటించిన నిధులకు సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, ఎంపీడీఓ జమలారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కందాల విస్తృత పర్యటన



జీళ్లచెరువులో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి గురువారం విస్తృతంగా పర్యటించారు. తొలుత చెరువు మాధారంలో కల్వరి మాట రక్షణ సువార్త వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం అప్పలనరసింహాపురంలో నూతన వధూవరులను ఆశీర్వదించడంతో పాటు అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, పాఠశాలలో సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక స్థానిక రామాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి దేవాలయం అభివృద్ధికి సహకరిస్తానని పేర్కొన్నారు. అనంతరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్‌లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించండి

కూసుమంచి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎంపీఓలు, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, సీసీ రోడ్ల నిర్మాణం తదితర సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, సర్పంచ్ కొండా సత్యం, ఎంపీటీసీ అంబాల ఉమా, దేవస్థానం చైర్మన్ బొడ్డు నరేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

'త్రివేణి'లో.. ఫేర్‌వెల్ డే



ఫేర్‌వెల్ డేలో విద్యాసంస్థల బాధ్యులు, సీఐ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని త్రివేణి పాఠశాలలో పది విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు గురువారం ఫేర్‌వెల్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ టి.గోపి, కృష్ణవేణి– త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్ర చౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వర్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని సందర్భాల్లోనూ మానసిక స్థైర్యాన్ని కోల్పోవద్దని సూచించారు. కార్యక్రమంలో కృష్ణవేణి కళాశాల డీన్ శేఖర్ బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ పి.రాజేంద్రప్రసాద్, సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో..

కూసుమంచి: మండలంలోని కస్తూర్బా విద్యాలయంలో గురువారం ఫేర్‌వెల్ డే వేడుకలు నిర్వహించారు. దీంతో పాటు కళాశాలలో నర్సింగ్ చదువుతున్న విద్యార్థులు లైటింగ్ ల్యాంప్ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంఈఓ బీవీ రామాచారి మాట్లాడుతూ.. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఎస్ఓ అజితకుమారి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'గిరిజనులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు'



గిరిజనులతో మాట్లాడుతున్న రాయల

కూసుమంచి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులను మోసం చేస్తున్నాయని టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు అన్నారు. గురువారం రాత్రి మండలంలోని లాల్‌సింగ్‌తండా, సంధ్యాతండా, తుమ్మలతండా గ్రామాల్లో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్రలో ఇచ్చిన సందేశాన్ని వివరించారు.ప్రజలను వంచిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదించాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు మట్టె గురవయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

యువకుడు కనిపించడం లేదని ఫిర్యాదు

నేలకొండపల్లి: మండలంలోని సుర్దేపల్లికి చెందిన యువకుడు కానరాకుండా పోవడంతో ఆయన కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుర్దేపల్లికి చెందిన కొరవి బ్రహ్మం గత నెల 14నుంచి కనిపించకపోగా, ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆయన తల్లి భద్రమ్మ ఫిర్యాదులో పేర్కొన్నారు.

గ్యాస్ ధరల పెంపుపై పోరు..

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచి సామాన్యులపై పెనుభారం మోపుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు బతకలేని స్థితికి తీసుకొస్తుందని ఆరోపిస్తూ సీపీఎం, సీపీఐ వాటి అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో గురువారం నిరసన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మండలాల్లోని ప్రధాన సెంటర్లు, ప్రభుత్వ కార్యాలయాల ఎదుట కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేసి పెంచిన ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.అనంతరం అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. గ్యాస్ ధరల పెంపు కొత్త ఏడాదిలో మోదీ మహిళలకు ఇస్తున్న కానుక అని పీఓడబ్ల్యూ నాయకులు అభివర్ణించారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమయూరిసెంటర్: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు



నేలకొండపల్లి: ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు



రఘునాథపాలెం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు